# 16వ పాఠం

# మంత్రించి ఊదటం, తాయెత్తులు వాడటం నిషిద్ధం

అబూ బషీర్ అన్సారీ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (సఅసం) వారి ప్రయాణంలో నేను వారివెంట ఉన్నాను. దైవప్రవక్త (స) చాటింపు వేసే ఒక వ్యక్తిని పంపించి ఈ విధంగా చాటింపు వేయించారు: "ఏ ఒంటె మెడలో కూడా (దిష్టి నివారణ కోసం) కట్టబడిన ఏ వస్తూవూ ఉండకూడదు. ఒకవేళ ఉంటే తక్షణం త్రెంచివేయాలి." (బుఖారీ ముస్లిం)

అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) కథనం:

"రుఖా (మంత్రించి ఊదటం), తమాయిమ్ (దిష్టి నివారణకై ఉపయోగించే తాయెత్తులు, త్రాళ్ళు), తివలహ్ (ఆలుమగల మధ్య ప్రేమానురాగాల పెంపుదలకై తొడిగే వస్తువులు)– ఇవన్నీ షిర్క్‌గానే పరిగణించబడతాయని దైవప్రవక్త (స) చెప్పగా నేను విన్నాను" (ముస్నదె అహ్మద్, అబూదావూద్)

**అర్రుఖా:** మంత్రాలు మొదలగువాటిని ఉచ్చరించటాన్ని అర్రుఖా అంటారు. మంత్రోచ్చారణలోని పదాల్లో గాని, దాని భావంలోగాని 'షిర్క్' లేని పక్షంలో అది సమ్మతమే. విషపురుగులు కాటు వేసినప్పుడు, దిష్టికి గురైనప్పుడు దైవప్రవక్త (స) 'రుఖా'కు అనుమతి ఇచ్చారు.

**తమాయిమ్:** దిష్టి నుంచి కాపాడటానికి పసిపిల్లల మెడల్లో వేసే తాయెత్తుల్ని తమాయిమ్ అంటారు. తాయెత్తులో గనక ఖుర్ఆన్ వాక్యాలు గాని, అల్లాహ్ పేరుగాని లేక అల్లాహ్ గుణవిశేషం గాని రాసి వుంటే దానిని తొడగవచ్చని 'సలఫ్' (తొలితరాల నికార్సయిన ముస్లింల)లోని కొంతమంది అభిప్రాయపడ్డారు. అయితే అత్యధికమంది దీనిని అసహ్యించుకున్నారు. దీనిని అసహ్యకరంగా భావించినవారిలో ఇబ్నె మస్వూద్ (రజి) కూడా ఉన్నారు.

https://teluguislam.net

**తివలహ్:** భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు పుట్టించగలమని కొందరు ఇలాంటి తాయెత్తులు, దారాలు కడుతూ ఉంటారు.

అబ్దుల్లాహ్ బిన్ ఉకైమ్ ద్వారా ఉటంకించబడిన మర్ఫూ హదీసు ప్రకారం "ఎవరైనా ఏదన్నా వస్తువునుగానీ, తాయెత్తునుగానీ ధరించినట్లైతే అతను దానికే అప్పగించబడతాడు" (ముస్నదె అహ్మద్, సునన్ తిర్మిజీ)

దైవప్రవక్త (సఅసం) తనతో ఇలా చెప్పారని రువైఫీ (రజి) తెలిపారు: "ఓ రువైఫీ! నా తదనంతరం నువ్వు చాలాకాలం వరకు జీవించి ఉంటా వేమో! కాబట్టి నువ్వు జనులకు తెలియజెయ్యి – ఎవరయితే గడ్డంలో ముడులు వేసుకుంటారో, హారాలు, దారపు పోగులు చుట్టుకుంటారో, (మలమూత్ర విసర్జనానంతరం) శుద్ధి కొరకు పశువుల ఎండిన పేడను లేక ఎముకను ఉపయోగిస్తాడో అతనితో ముహమ్మద్ (స)కు ఎటువంటి సంబంధంలేదు." (అహ్మద్)

సయీద్ బిన్ జుబైర్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు: "తాయెత్తు (లేక అటువంటిదే మరేదన్నా త్రాడును) ధరించిన వ్యక్తి నుంచి దానిని తీసివేయించిన వానికి ఒక బానిసకు విముక్తినిచ్చిన పుణ్యం లభిస్తుంది."

వకీ (రహ్మాలై) కథనం: మహా విద్వాంసులు ఇబ్రాహీం నఖయీ (రహ్మాలై) అన్ని రకాల తాయెత్తులను – చివరికి అవి ఖుర్ఆన్ ఆయతులతో కూడిన తాయెత్తులైనా, మరే రకమైన తాయెత్తులయినా సరే– ధరించటాన్ని అసహ్యించుకునేవారు." (వకీ మరియు ఇబ్రాహీం నఖయి–రహ్మాలై– ఇరువురూ ఇబ్నె మస్వూద్ (రజి) గారి శిష్యులు).

## ఈ పాఠంలోని ప్రధానాంశం

పైన పేర్కొనబడిన మూడు రకాల చర్యలు షిర్క్ క్రిందికి వస్తాయి. అంటే (1) రుఖా (2) తమాయిమ్ (3) తివలహ్ – ఇవి మూడు కూడా బహుదైవారాధనగానే పరిగణించబడతాయి.

https://teluguislam.net